RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 146 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 29 నవంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# పాలమూరులో రైతులందరికీ గుడ్ న్యూస్ చెప్పనున్న రేవంత్

## ఈ నెల 30న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధుల జమ..!!








తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు రుణమాఫీ పెండింగ్ నిధులతో పాటు గా వరి బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటన చేసారు. ఈ నెల 30న రైతు పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని, ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుంద ని పేర్కొన్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రైతుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించనుంది. తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ రుణమాఫీ నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 30న మాఫీ అమలు కాని రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులకు పలు కారణాలతో రుణమాఫీ అమలు కాలేదు. ఆ తరువాత ప్రభుత్వం వారికి రుణమాఫీ అమలయ్యేలా చర్యలు తీసుకుంది. నాలుగు లక్షల మందికి అర్హత ఉందని గుర్తించింది. వీరికి ఈ నెల 30న రైతు పండుగ కార్యక్రమంలో చెల్లించేలా నిర్ణయం ప్రకటించింది. ఇదే సమయంలో సన్నరకాల ధాన్యంకు సంబంధించి రైతులకు ఇస్తామన్న రూ.500 బోనసను కూడా అదే రోజున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల వివరించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. దీనికి సంబం ధించిన ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ ఉన్నట్లు మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థకు రూ.50వేల కోట్లు బాకీ పడగా అందులో రూ.12వేల కోట్లను తమ ప్రభుత్వం తీర్చిందని వెల్లడించారు. మిగిలిన మొత్తాన్ని దశల వారీగా చెల్లిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కీలక పత్రాలు మాయమయ్యాయని మంత్రి ఆరోపించారు.



## ఒక్క ఏడాదిలోనే 6213 స్కూళ్లు మూతపడే దుస్థితి వచ్చింది

### రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం

ప్రతి చిన్న గ్రామానికి ప్రైమరీ స్కూల్, ప్రతి రెవెన్యూ గ్రామానికి అప్పర్ ప్రైమరీ స్కూల్, హైస్కూల్ ఏర్పాటు చేస్తామని అభయహస్తం మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రగల్భాలు పలికారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకముందే జీరో స్కూల్ పేరిట 1,899 స్కూల్‌లు, 10 మందిలోపు విద్యార్థులు 4,314 స్కూళ్లు మొత్తం కలిపి 6,213 స్కూల్స్‌ని శాశ్వతం గా మూసి వేసే ప్రణాళిక లో భాగంగానే ఆ స్కూల్లో పనిచేసే 5,741 మంది టీచర్లను బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం 7,289 కోట్లతో మన ఊరు - మన బడి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సన్న బియ్యంతో పౌష్టిక ఆహారం అందించారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ సర్కారు వచ్చీ రాగానే సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం రద్దు చేయడం, మన ఊరు మన బడి ప్రోగ్రాం కొనసాగించకపోవడం, పురుగులన్నం, విషాహారంతో మధ్యాహ్న భోజనం వల్ల ప్రభుత్వ పాఠశాల పరపతి తగ్గి ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతోందని పేర్కొన్నారు. ఒక్క సంవత్సరం లోనే 6,213 ప్రభుత్వ స్కూల్స్ మూత పడే దుస్థితికి రేవంత్ సర్కారు దిగజార్చిందని మండిపడ్డారు.

## ప్రభుత్వ సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు. ఎన్యుమరేటర్‌లు, అధికారులు ఆయన వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే పురోగతిపై సీఎం



అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



## తెలంగాణ కాంగ్రెస్ చేతిలో కమలం జాగ్రత్తగా ఉంది: కేటీఆర్

హైదరాబాద్: రాజకీయ లబ్ధి కోసం కమలం, కాంగ్రెస్ నేతలు కలిసికట్టుగా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్ని అరాచకాలు జరిగినా ఒక్కరూ నోరు మెదపరని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ చేతిలో కమలం జాగ్రత్తగా ఉందంటూ ఎద్దేవా చేశారు. చీకటి రాజకీయ ప్రయోజనాల కోసం 'చేతి' కలుపుతూ చోటేభాయ్ కోసం కలిసి పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదగాలని, అంతా కలసికట్టుగా పనిచేయాలని ప్రధాని మోదీ ఆ పార్టీ ఎంపీలకు సూచించిన విషయం తెలిసిందే. ప్రధాని వ్యాఖ్యలపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'కలిసికట్టుగానే పని చేస్తున్నారు మీ కమలంనేతలు. కాంగ్రెస్ నేతలతో కలిసిపోయి మరీ పని చేస్తున్నారు. చోటేభాయ్ కు వ్యూహకర్తగా.. కాంగ్రెస్ కట్టర్ కార్యకర్తలుగా విశ్రమించకుండా పని చేస్తున్నారు. చీకటి రాజకీయ ప్రయోజనాల కోసం 'చేతి' కలుపుతూ చోటే భాయ్ కోసం కలిసి పని చేస్తున్నారు. ఎన్ని అరాచకాలు జరిగినా ఒక్కరూ నోరుమెదపరు. రేవంత్ మీద ఈగ వాలకుండా కాపాడుకుంటారు. హైడ్రా మంచిదంటారు, మూసి కావాలంటారు, ఏమన్నా అంటే నిద్ర నటిస్తారు. పిల్లలు చనిపోయినా, రైతు గుండె పగిలినా, గిరిజనులను చెరపట్టినా.. చప్పట్లు కొడతారు. తెలంగాణలో వారి చేతిలోనే కమలం ఉంది.. జాగ్రత్తగా.. భద్రంగా!' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# 'యాసంగి' పెట్టుబడి ఎట్లా?

## దాదాపుగా పూర్తికావచ్చిన వానాకాలం కోతలు

## నవంబర్ ఒకటో తేదీ నుంచే మొదలైన యాసంగి సీజన్

**రాష్ట్రంలో యాసంగి పంట సాగు అంశం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. సర్కారు నుంచి అందాల్సిన రైతుభరోసాపై అస్పష్టత నెలకొనడం.. రుణమాఫీ పూర్తిగాక బ్యాంకుల నుంచి కొత్త రుణాలు అందే పరిస్థితి లేకపోవడంతో... యాసంగికి పెట్టుబడులు ఎలాగని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ప్రైవేటు అప్పుల బాటపట్టాల్సిన దుస్థితి వస్తుందా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం పంట కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. మరో 20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉందని భావిస్తోంది. మరోవైపు నవంబర్ ఒకటి నుంచే యాసంగి (రబీ) సీజన్ మొదలైంది. నిజామాబాద్, నల్లగొండ వంటి జిల్లాలతోపాటు పంట కోతలు పూర్తయిన ప్రాంతాలన్నిటా రైతులు యాసంగి సాగు మీద దృష్టి పెట్టారు. దుక్కులు దున్ని, పొలాలను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నారు పోస్తున్నారు. కానీ పంట సాగుకు పెట్టుబడులు ఎలాగని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

**'రైతుభరోసా'పై అస్పష్టత..:** రాష్ట్ర ప్రభుత్వం 'రైతుబంధు' పథకం కింద రైతులకు పంట పెట్టుబడి సాయంగా 2018 ఖరీఫ్ నుంచి ఆర్థిక సాయాన్ని అందిస్తూ వస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023-24 వానాకాలం సీజన్ వరకు 11 విడతలుగా రైతుబంధు మంజూరు చేసింది. చివరిసారిగా 2023-24 వానాకాలం సీజన్‌లో 68.99 లక్షల మంది రైతులకు రూ.7,624.74 కోట్లు రైతుబంధు సాయంగా అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయాన్ని ఏటా రూ.15 వేలకు పెంచి 'రైతు భరోసా' పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. కానీ 2023-24 యాసంగికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో ఐదెకరాలలోపు భూమి ఉన్న వారికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.5,575 కోట్లు విడుదల చేసింది. తర్వాత ఐదెకరాలపైన ఉన్న వారికి కూడా పెట్టుబడి సాయం విడుదల చేసినట్టు ప్రకటించింది. అయితే.. 2024-25 వానాకాలానికి సంబంధించి 'రైతు భరోసా (రైతుబంధు)' పెట్టుబడి సాయం రైతులకు అందలేదు. దీనిపై ఇటీవల వ్యవసాయ మంత్రి తుమ్మలను ప్రశ్నిస్తే.. వానాకాలం సీజన్ అయిపోయిందని, యాసంగి నుంచి రైతు భరోసా ఇస్తామని చెప్పారు. కానీ యాసంగి సీజన్ మొదలై నెలరోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం ఊసే లేదు. దీనితో పంట పెట్టుబడులు ఎలాగని రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. పెట్టుబడి సాయం పెంచి 'రైతు భరోసా' ఇవ్వడమేమోగానీ.. రైతు బంధుకూ దిక్కులేకుండా పోయిందని వాపోతున్నారు.

**రైతులందరికీ 'భరోసా' అందేనా?...** యాసంగి నుంచి పెట్టుబడి సాయం ఇస్తామని మంత్రి తుమ్మల ప్రకటించినా.. ఎవరెవరికి అందుతుందన్న దానిపై స్పష్టత లేని పరిస్థితి. గుట్టలు, రోడ్లు, సాగులో లేని భూములకు పెట్టుబడి సాయం ఇచ్చేది లేదని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికితోడు గరిష్టంగా ఐదెకరాలకే పెట్టుబడి సాయం ఇచ్చే ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రైతుల సాగుభూములపై ఇప్పటికే సర్వే చేపట్టినట్టు తెలిసింది. సాగు జరిగిన భూముల లెక్కలు తేలితేనే పెట్టుబడి సాయం అందించే రైతుల ఖాతాల్లో పడే అవకాశం ఉంది. దీనిలో ఎంత మంది రైతులకు, ఎంత వరకు పెట్టుబడి సాయం అందుతుందన్న దానిపై అస్పష్టత నెలకొంది. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో రైతు సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అప్పుడైనా పెట్టుబడి సాయంపై ప్రకటన వెలువడుతుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రుణమాఫీ పూర్తవక రుణాలకు ఇబ్బంది..** కాంగ్రెస్ సర్కారు హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. రాష్ట్రంలో రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులు సుమారు 40 లక్షల మందికాగా.. ప్రభుత్వం 22 లక్షల మందికి సంబంధించి రూ. 18 వేల కోట్లను మాఫీ చేసింది. మిగతావారికి రుణమాఫీ జరగాల్సి ఉంది. రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్, పాస్ పుస్తకాల్లో పేర్లు తప్పుగా ఉండటం, కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మందికి రుణాలు ఉండటంతోపాటు పలు సాంకేతిక కారణాలతో వారికి రుణమాఫీ జరగలేదు. వ్యవసాయ శాఖ వారి వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించింది కూడా. అయితే పంట పెట్టుబడుల కోసం రుణం కావాలని వెళితే.. పాత రుణాలు ఇంకా మాఫీ కానందున కొత్త రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు తేల్చి చెబుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతేకాదు మాఫీకాని రుణాలకు సంబంధించి వడ్డీలు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొంటున్నారు. వానాకాలం ధాన్యానికి సంబంధించిన సొమ్ము కూడా ఇంకా అందలేదని కొందరు రైతులు చెబుతున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## కల్పన.. ఓ ఇల్లాలే కాదు.. ఆమె ఓ మహాశక్తి..

ప్రతి మగవాడి విజయం వెనుక ఆడవారు ఉంటారని అంటుంటారు. అక్షరాల అది నిజం అని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విషయంలోనూ రుజువైంది. ఎన్నికల ప్రచారంలో సీఎం హేమంత్ సోరెన్, అతని భార్య కల్పనా సోరెన్‌లను కార్నర్ చేస్తూ 'బంటీ–బబ్లీ' అంటూ బీజేపీ వారిపై పలు విమర్శలు చేసింది. కానీ.. వారి మాటలకు చెక్ పెడుతూ తమ సక్సెస్‌ను చాటింది ఈ ఆదర్శ జంట. మరోసారి జార్ఖండ్‌లో విజయం సాధించి తామేంటో బీజేపీకి చూపించారు. కల్పనా సోరేన్ ముఖ్యమంత్రి భార్య అయినప్పటికీ.. బేసిక్‌గా ఆమె ఓ వ్యాపారవేత్త.. సామాజిక కార్యకర్త. ఇది మొన్నటివరకు ఆమెకు ఉన్న గుర్తింపు. కానీ.. ఇప్పుడు ఆమె ఓ ఎమ్మెల్యే. పార్టీలో ఆమెదే కీ రోల్. అన్నింటికీ మించి భర్తకు మరోసారి సీఎం పీఠాన్ని అందించిన ధీశాలి. ఒక సాధారణ మహిళ నుంచి ఆమె ఓ మహాశక్తి వరకూ ఎదిగిన తీరు అందరికీ ఆదర్శం అని చెప్పాలి. భర్తకు కష్టకాలంలోనూ తోడుగా నిలుస్తూ.. భర్త రాజకీయాల్లో సక్సెస్ సాధించేందుకు ఆమె చేసిన కృషి కూడా వర్ణించలేనిది. కల్పన స్వస్థలం ఒడిశాలోని మయూర్‌భంజ్ నగరం. పెరిగింది అంతా కూడా రాంచీలోనే. నాన్న అంపా ముర్ము ఆర్మీలో పనిచేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలతో ఆవె కలిసి పెరిగారు. దీంతో అన్ని సంప్రదాయాల గురించి ఆమెకు అవగాహన ఉంది. ఇంజినీరింగ్ పూర్తయిన వెంటనే పెళ్లయింది. భర్త హేమంత్ సోరేన్ జార?ండ్ ముక్తి మోర్చా నాయకుడిగా ఉన్నారు. దీంతో పెళ్లయ్యాక ఆమె కుటుంబానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చేయాలని ఆమె కల కావడంతో.. ప్రెగ్నెన్సీకి ఉన్నప్పటికీ చదివి పట్టా సాధించారు. ప్రసవం అయ్యేలోపు ఎంబీఏ పట్టాను ఆమె పొందారు. కల్పన తల్లి పెద్దగా చదువుకోలేదు. ఆమెకు గిరిజన భాష తప్పితే హిందీ రాదు. అందుకే కల్పన ప్రతీ మహిళ చదువుకోవాలి.. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుందని నమ్మారు. దాంతో గిరిజన అమ్మాయిలకు చదువు చెప్పించేందుకు ఆవె కృషి చేశారు. విద్యాసంస్థలు ప్రారంభించడంతోపాటు అప్పుడే వ్యాపార రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇద్దరు పిల్లలతో హాయిగా ఆనందంగా ఉన్నారు. ఆ ఆనందానిని మరింత రెట్టింపు చేస్తూ హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అనుకోని పరిస్థితుల్లో మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ అరెస్ట్ కావాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆవెలో ఆత్మవిశ్వాసం దెబ్బతినలేదు. అప్పుడే ఆమె ధైర్యంగా రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. 'నా భర్త జైలుకు వెళ్లినప్పుడు అత్తింటివారు అంతా కూడా కన్నీరు పెట్టుకున్నారు. నేను మాత్రం ధైర్యంగా నిలవాలని అనుకున్నాం. కానీ.. వారిని చూసి నాకూ కన్నీరు ఆగలేదు. ఇప్పుడు మీ ప్రేమాభిమానాల ముందు నేనెంత బలవంతురాలినో అర్థమైంది. కుటుంబ బాధ్యతతోపాటు నా మమ అందించిన పార్టీ బాధ్యతను సవ్యంగా నడిపిస్తా' అని తన మాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అంతే.. నెలల వ్యవధిలోనే గాండేయ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆమె తొలి విజయం సాధించి గ్రేట్ అని నిరూపించుకున్నారు. అందుకే.. కల్పనను అందరూ హేమంత్ భార్య మాత్రమే కాదని, ఆమె ఓ మహిళా శక్తి అని అంటుంటారు.

## నిరుపేద కుటుంబానికి అండగా సహాయం



**గంభీరావుపేట నవంబర్ 28(ప్రభాత సమాచారం):** గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొహమ్మద్ హమీద్ ఆదేశాల మేరకు గురువారం గంభీరావుపేట న్యూ హనుమాన్ నగర్ కాలానికి చెందిన మండ్ల రాజం సతీమణి మండ్ల సరూప గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు,మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు, ఉన్నారు, విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ హమీద్ మనసు చెల్లించి అట్టి నిరుపేద కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తృణప్రాయంగా 25 కేజీల సన్నబియ్యాన్ని వితరణగా ఆ కుటుంబానికి ఇవ్వడం జరిగింది. ఈ కుటుంబానికి అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది అని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమానికి సొషల్ మీడియా కన్వీనర్ (గౌరీ) శంకర్, సీనియర్ నాయకులు బంగ్లా రాజు గౌడ్, జంగం రాజులు, యువ నాయకులు రాజశేఖర్ మరియు తదీతరులు పాల్గొన్నారు.

## మెట్ట ప్రాంతం.. సాగునీరందితే సస్యశ్యామలం



ధర్మారం : మెట్ట ప్రాంతమైన ధర్మారంలో జలాశయం నిర్మించాలన్న ఈ ప్రాంత ప్రజల కలలు నెరవేర్చేందుకు మరో అడుగు ముందుకు పడింది. పత్తిపాకలో మూడు టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మాణానికి కసరత్తు మొదలైంది. ప్రతిపాదిత స్థలాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, ఉన్నతాధికారులు పరిశీలించారు. జలాశయం ఏర్పాటుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అన్నదాతలు సానుకూలంగా స్పందించడంతో సమగ్ర సర్వేకు మార్గం సుగమమైంది. దీంతో జలాశయం పనులకు ప్రత్యేక అధికారిని నియమిస్తామని మంత్రి ప్రకటించారు. డిసెంబరు 4న పెద్దపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జలాశయంపై స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

**దేవికొండ నుంచి ఎత్తిపోతలు**

జలాశయం ప్రతిపాదిత స్థలం ఎత్తైన ప్రదేశం కావడంతో జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దేవికొండ రిజర్వాయర్ నుంచి పంపుహౌస్ ద్వారా నీరు ఎత్తిపోయనున్నారు. రామడుగు మండలం మోతె వద్దనున్న వరద కాలువ నుంచి జలాశయం వరకు కాలువ తవ్వనున్నప్పటికీ ఆ కాలువ ద్వారా ప్రతిపాదిత జలాశయంలో 1.5 టీఎంసీల నీరు మాత్రమే నింపేందుకు అవకాశం ఉంది. 1.5 టీఎంసీలకు మించి నీటిని నింపితేనే కాకతీయ కాలువలోకి నీళ్లు చేరుతాయి. ఒకటిన్నర టీఎంసీలు ధర్మారం, ఎండపల్లి మండలాల్లోని పదివేల ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే విడుదలకు సాధ్యమవుతుంది.


**రూ.1,950 కోట్ల వ్యయం**

జలాశయం, కాలువ తవ్వకానికి సుమారు 1400 ఎకరాల భూమి అవసరమని ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో 450 ఎకరాల అటవీ భూమి ఉంది. భూసేకరణతోపాటు జలాశయం, కాలువల ఏర్పాటుకు రూ. 1,950 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జలాశయం నుంచి చొప్పదండి మండలం రేవెల్లి శివారులో కాకతీయ కాలువకు అనుసంధానం చేయడం ద్వారా ధర్మారం, వెల్గటూరు మండలాలు, పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు 2.40 లక్షల ఎకరాలకు సాగు నీరందనుంది. ఎల్ఎండీకి నీటిని తరలించవచ్చు.

**కాకతీయ కాలువతో అనుసంధానం**

పది మీటర్ల ఎత్తులో కాలువ తవ్వకానికి అంచనాలు రూపొందించారు. తద్వారా ఎస్సారెస్పీ కాలువ నీరు పారని.. మెట్ట ప్రాంతంలో ఉన్న పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. రేవెల్లి నుంచి జలాశయం వరకు నాలుగు వేల ఎకరాలు, జలాశయం దిగువన పత్తిపాక, బొమ్మారెడ్డిపల్లి, కొత్తపల్లి, ఎండపల్లి శివార్లలోని ఆరు వేల ఎకరాలకు సాగునీరందనుంది. ప్రతిపాదిత జలాశయం నుంచి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ వరకు ఏడు కిలోమీటర్ల పొడవున కాలువలు తవ్వి అనుసంధానించనున్నారు.

## స్టాక్ మార్కెట్‌పై అవగాహన అంతంతే..!



గోదావరిఖని : స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బండి స్వామిగౌడ్(35) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాలడెయిరీ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న స్వామిగౌడ్ ఇంటిని తాకట్టు పెట్టి తీసుకున్న రుణం, పాలడెయిరీ వ్యాపారంలో వచ్చిన ఆదాయాన్ని స్టాక్‌మార్కెట్‌లో వెచ్చించాడు. మొత్తంగా రూ. 25 లక్షల వరకు నష్టపోవడంతో రూ. 10 లక్షలు అప్పు చేశాడు. రుణభారం పెరిగిపోవడంతో ఈనెల 11న పురుగు మందుతాగాడు. చికిత్స పొందుతూ 17న మృతి చెందాడు.

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన పడాల శ్రీధర్(35) స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టగా నష్టాలు వచ్చాయి. టెంట్‌హౌజ్ నిర్వహిస్తున్న శ్రీధర్ 2.20 ఎకరాల పొలాన్ని విక్రయించినా అప్పులు తీరకపోవడంతో ఈనెల 18న గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

ఇవి ఇటీవల వెలుగులోకి వచ్చిన సంఘటనలు. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయన్న నమ్మకంతో ఎంతోమంది కనీస అవగాహన లేకుండానే డబ్బులు వెచ్చిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 2.5 లక్షల మంది వీటిలో పెట్టుబడులు పెట్టేవారు ఉన్నారు. షేర్లు కొనేందుకు భారీగా అప్పులు తేవడం. పెట్టుబడుల్లో ఆశించిన స్థాయిలో పెరుగుదల లేకపోవడం నష్టాలకు కారణమవుతోంది. తెచ్చిన అప్పునకు వడ్డీ భారం పెరగడంతో వాటిని తీర్చేందుకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. అయినా భారం తగ్గకపోవడంతో గత్యంతరం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రోజువారీగా లాభం సాధించాలని చేస్తున్న ట్రేడింగ్ సైతం ఒక్కోసారి వ్యతిరేక ఫలితాలనిస్తోంది.

**పెరిగిన ఆన్‌లైన్ ట్రేడింగ్**

కొవిడ్ సమయంలో ఇళ్లకే పరిమితం కావడంతో ఆన్‌లైన్‌లో స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. గతంలో షేర్‌మార్కెట్ బ్రోకింగ్ కార్యాలయాల్లో ట్రేడింగ్ నిర్వహించేవారు. డీమ్యాట్ ఖాతా ఉండటంతో పాటు బ్రోకింగ్ అవకాశం ఉన్న వారంతా వివిధ కంపెనీల బ్రోకింగ్ కార్యాలయాల్లోనే లావాదేవీలు చేపట్టేవారు. ప్రస్తుతం ప్రతి కంపెనీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అవకాశం ఇవ్వడంతో ఎక్కువ శాతం మంది సెల్‌ఫోన్ ద్వారానే ఇంటినుంచి లావాదేవీలు కొనసాగిస్తున్నారు. కొవిడ్ సమయంలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు ఇళ్లలోనే ఉండటంతో ఆన్‌లైన్ డీమ్యాట్ ఖాతాలు తెరిచి ట్రేడింగ్‌కు అలవాటు పడ్డారు. ఇలా ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసే వారు ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు లక్షల మంది ఉంటారు. ఉమ్మడి జిల్లాలో 45 వరకు షేర్‌మార్కెట్ బ్రోకింగ్ కార్యాలయాలున్నాయి. వీటిలో 50 వేల మంది వరకు పెట్టుబడుల నిర్వహణ చేపడుతుంటారు.

**అత్యాశతోనే...**

వివిధ కంపెనీల పేరుతో షేర్లు కొంటున్న చాలామంది వెనువెంటనే లాభాలు రావాలని ఆశపడుతున్నారు. పెట్టుబడి పెట్టిన అనంతరం కొన్ని రోజుల పాటు నిలకడగా ఉంటేనే దాని ఫలితాలు అందే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో ఉన్న హెచ్చు తగ్గుదల కారణంగా షేర్ల ధరలు రెట్టింపు కావచ్చు ఒక్కోసారి షేరు విలువ అమాంతం పడిపోవచ్చు. లేదా స్తబ్దుగా ఉండవచ్చు. ఇటువంటి పరిణామాలను నిశితంగా పరిశీలించే పరిజ్ఞానం పెట్టుబడులు పెట్టిన వారికి అవసరం. అలా కాకుండా చాలామంది పెట్టుబడులు పెట్టిన వెంటనే డబ్బులు రెట్టింపు కావాలని ఆశపడుతున్నారు. మార్కెట్‌లో ఒడుదొడుకులు ఎదురైనప్పుడు మానసిక వేదనకు గురవుతున్నారు. ఒక్కోసారి పూర్తిగా నష్టపోవడంతో అప్పుల పాలవుతున్నారు.

**నష్టాలకు కారణాలు**

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే సమయంలో తొందరపాటు వద్దు.

ఇంట్రాడే, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, స్టాప్‌లాస్ పేరుతో లావాదేవీలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి.

ఎవరో చెప్పిన సలహా పాటించి పెట్టుబడులు పెట్టకూడదు. సలహా ఇచ్చిన వారి అనుభవం, వారికి ఉన్న చరిత్రను గమనించాలి.

అప్పులు చేసి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే ఎప్పటికైనా ముప్పు తప్పదు.రోజు వారిగా కొని, అమ్మే షేర్ల విషయంలో అనుభవం లేకుండా ట్రేడింగ్ చేయవద్దు.

**ఇవి పాటిస్తే మేలు**

ఒక షేర్ కొనుగోలు దీర్ఘకాలికంగా ఉండేలా ప్రణాళిక వేసుకోవాలి.

షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఓపిక అవసరం.

ఒకే రకమైన షేర్లలో పెట్టుబడి పెట్టకుండా వివిధ కంపెనీలకు చెందిన షేర్లు కొనుగోలు చేయాలి.

మార్కెట్‌లో షేర్ విలువ, కంపెనీ స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం అనుభవజ్ఞుల సలహా పాటించాలి.

ప్రజలు ఎక్కువగా వినియోగించే వస్తువులకు సంబంధించిన కంపెనీల్లో పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నించాలి.

తక్కువ విలువ ఉన్న షేర్‌లను కొనుగోలు చేసి ఓపికగా వేచిఉండాలి.

## మారాలి మనం.. కేరళలా..!

సూర్యాపేట : ఈ తరుణంలో దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళ అనుసరిస్తున్న విధానాలతోనే సర్కారు పాఠశాలలు బలోపేతం చేయవచ్చని విద్యారంగ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం పట్టణాలకు బస్సుల్లో తమ పిల్లల్ని పంపుతుండగా సంఖ్య తగ్గిపోతుంది. మరోవైపు గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ విద్యా సంస్థల్లో పోటీ పరీక్షలు రాసి నిరుపేద విద్యార్థులు చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య ఏటా తగ్గిపోతోంది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా 3,151 మంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోయింది.

సూర్యాపేట జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం 4,522 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

కేరళ విద్యారంగం విధానాలు మచ్చుకు కొన్ని...

దేశంలోనే మొదటిసారి 2007లో ఈ సూచనలను కేరళ వంద శాతం అమలు చేసి విజయం సాధించింది.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

5 కిలోమీటర్లను యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. అన్ని వసతులు, తరగతి గదులు కల్పించారు.




కేరళలో 40వేల జనాభా దాటిన చోట ఒక్క ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నారు. ఐదంచెల విధానంలో తనిఖీ చేసిన తరువాతే ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇస్తూ పూర్తిగా నియంత్రించారు. కేరళలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 10 శాతం మిషనరీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉండగా కేవలం 10 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

'తల్లిదండ్రులు, టీచర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి..వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. ప్రతి 2 నెలలకు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు.

ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నిధులలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవోకు ఉండే అధికారాలు కల్పించారు. క్రమశిక్షణ పాటించని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌తో పాటు సర్వీసు నుంచి తొలగించే అధికారాలు ఉంటాయి.

జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 2005లో విద్యారంగ ప్రమాణాల పెంపునకు గాను 2005 జాతీయ పాఠ్యపుస్తకాల నిర్ణయ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా రాష్ట్రాలలో పూర్తి అధ్యయనం తరువాత ప్రాంతీయ భాషకు, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక స్థితిగతులు, స్థానిక పరిస్థితులను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆదేశించారు.

## సమీకృతం.. సగం సగం..!

నల్గొండ : పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం అటకెక్కింది. గత ప్రభుత్వం కూరగాయలు, మాంసాహారం తదితరాలు అన్నీ ఒకేచోట విక్రయాలు జరగాలని భావించి సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట, నల్గొండ మినహా అంతటా పనులు పడకేశాయి. పునాదులకే పరిమితమయ్యాయి. కేటాయించిన నిధులు కూడా మంజూరు కాక నిర్మాణం కలగానే మారింది. పూర్తయిన రెండు చోట్ల ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రూ.కోట్లు కేటాయించినా నిష్ఫలం కావడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే విక్రయాలు**

సూర్యాపేటలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 30.18 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. గతేడాది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు వ్యాపారులు అక్కడ విక్రయాలు చేపట్టడం లేదు. ఆరుబయటనే తమ క్రయవిక్రయాలు చేపడుతున్నారు.

**నల్గొండలో నిరుపయోగంగా..**

నల్గొండలో రూ. 8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

**అదనపు నిధులు మంజూరైనా..**

చిట్యాలలో ఇన్‌గ్రాంట్ బడ్జెట్ కింద 2021లో రూ. 2 కోట్ల అంచనాతో సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించారు. డిజైన్ మాత్రం రూ. 5 కోట్లకు రూపొందించారు. అదనంగా రూ. 3 కోట్ల నిధులు మంజూరైనా గుత్తేదారుతో అదనపు నిధుల పనుల ఒప్పందం జరగలేదు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్లాబ్‌ల వరకు పనులు జరిగాయి.

నకిరేకల్‌లో రూ. 2 కోట్లతో ప్రారంభించి రెండు స్లాబుల వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో జాప్యం కారణంగా గుత్తేదారును మార్చి మరొకరికి అప్పగించినా ముందుకు సాగటం లేదు.

దేవరకొండలో రూ. 4.5 కోట్లు మంజూరవగా స్థల సమస్యతో కొంతకాలం వాయిదా పడింది. ప్రస్తుతం అంచనా విలువ రూ. 11 కోట్లకు పెంచారు. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

హాలియాలో రూ. 2 కోట్లతో పనులు చేపట్టగా స్లాబ్ వరకు నిర్మించారు. అంచనా వ్యయం రూ. 5 కోట్లకు పెంచారు. పనులు నిలిచిపోయాయి.

**బిల్లులు అందక.. పనులు సాగక**

చండూరులో పిల్లర్ల దశ వరకే నిర్మించారు. దీని నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగతా పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి.

మిర్యాలగూడలో రూ. 1.20 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగానే ఉంది. ఇక్కడ కూడా నిధులు సరిపడక పనులు ముందుకు సాగటం లేదు.

భువనగిరిలో రూ. 8.40 కోట్ల అంచనాతో చేపట్టగా నిధుల కొరత కారణంగా నిర్మాణం ముందుకుసాగటం లేదు.

ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికలలో ఒక్కో దానికి రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

**రాకపోకలకు ఇబ్బంది...**

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు, సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు రావడంతో దారి మళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జనసందడి పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.

# పనుల జాతర నేడు



తాండూరు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించి 'పనుల జాతర' చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఇప్పటికే మంజూరు చేసిన పనులకు నేడు ఎమ్మెల్యేలు, అన్నిశాఖల అధికారులు, రాజకీయ పార్టీ నేతలతో కలిసి సంబరంగా శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. **రూ.కోట్ల పనులు..**జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలతో కొన్ని పనులు ప్రారంభించేలా సన్నద్ధం చేశారు. అన్ని గ్రామాల్లో పంచాయ తీల పరిధిలో కార్యదర్శులు, గ్రామస్థాయి నాయకులు పనుల జాతరలో పాల్గొననున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.4కోట్ల మెటీరియల్ పనులు, రూ.13లక్షల కూలీలు చేసే పనులు ప్రారంభిస్తారు. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల కింద మంజూరైన నిధులకు సంబంధించి సిమెంటు దారులు, గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభిస్తారు. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం మంతట్టి, తాండూరు మండలం గోనూరులో పనుల జాతర కార్యక్రమ శంకుస్థాపనలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు.

**వీటికే శంకుస్థాపనలు**

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా పథకం కింద పశువుల పాకలు, కోళ్ల ఫారాలు, వ్యవసాయ పొలాలకు బాటలు, సిమెంటు దారులు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పొలాలు, గృహ సముదాయాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఉపాధి పథకంలో వ్యక్తిగతంగా మంజూరైన పనులకు సంబంధించిన మంజూరు పత్రాలను అధికారులు పంపిణీ చేయనున్నారు.

**మార్చి నాటికి పూర్తి చేయిస్తాం**–శ్రీనివాస్, డీఆర్‌డీఓ, వికారాబాద్

ఉపాధి హామీ, సెర్ప్ ఆధ్వర్యంలో ఈఏడాది మంజూరైన పనులను పనుల జాతరలో శంకుస్థాపన చేస్తారు. ఉపాధి పథకంలో మెటీరియల్, కూలీల పనులకు సంబంధించినవి ఉన్నాయి. వీటిని మండల స్థాయిలో పర్యవేక్షణ పెంచి 2025 మార్చి నాటికి పూర్తి చేయిస్తాం.

# ఆంగ్ల విద్య.. బాలికలకు ఆమడదూరం

పెద్దేముల్ : పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శ పాఠశాలలను 2009–2010 విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేశాయి. ముందుగా తరగతుల నిర్వహణ కోసం గదులను నిర్మించారు. విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. బాలికల కోసం వసతి గృహాలను నిర్మించాల్సి ఉంది. అందుకు 2012లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.1.29 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. సగంలోనే ఆగిపోయాయి. 12 ఏళ్లు గడుస్తున్న అడుగు ముందుకు పడటం లేదు.

**తిరగొచ్చేసరికి రాత్రి 8 గంటలవుతోంది**

మొదట ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు బోధన కొనసాగింది. ప్రభుత్వం ఏటా తరగతుల స్థాయిని పెంచుతూ పోయింది. ఇప్పుడు ఇంటర్ వరకు బోధిస్తున్నారు. మారుమూల గిరిజన తండాల నుంచి బాలబాలికలు విద్యాభ్యాసం కోసం రోజూ ఉదయం 8 గటలకు ఇంట్లో నుంచి బయలుదేరితే తిరిగి వచ్చే సరికి రాత్రి 8 గంటలవుతోంది. బిడ్డలు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు



వాపోతున్నారు.

**తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య**

వసతి సౌకర్యం లేక బాలికల సంఖ్య ఏటా తగ్గుతోంది. రెండేళ్ల క్రితం పెద్దేముల్ ఆదర్శ పాఠశాలలో 433 మంది విద్యార్థులు ఉంటే అందులో బాలికలు 170 మంది వరకు ఉండేవారు. ప్రస్తుతం 275 మంది విద్యార్థులుంటే బాలికలు 90 మంది మాత్రమే ఉన్నారు.

**గిట్టుబాటు కాదని ముందుకురాని గుత్తేదారులు**

వసతి భవన నిర్మాణానికి నిధులు నామమాత్రంగా మంజూరు చేస్తున్నారు. అప్పటి రేట్ల ప్రకారమే ప్రభుత్వం కేటాయిస్తోంది. దీంతో పనులు చేస్తే గిట్టుబాటు కాదన్న కారణంతో గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు.

# ఐటీఐల్లో అధునాతన సాంకేతిక శిక్షణ

హైదరాబాద్ : పదోతరగతి పాసైన విద్యార్థులకు పరిశ్రమల్లో విధుల్లో నిర్వహించేందుకు అవసరమైన పారిశ్రామిక శిక్షణ ఇస్తున్న ఐటీఐలు ఆధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాలు(ఏటీసీ)గా రూపొందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రాంతాల్లో శరవేగంగా నిర్మాణాలు పూర్తవుతున్నాయి. రూ.2379 కోట్లతో రూపుదిద్దుకుంటున్న ఏటీసీలకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ 86.75శాతం ఆర్థికసాయం అందిస్తోంది. అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞాన శిక్షణ అందిస్తున్న ఈ కేంద్రాలకు ఉపాధి శిక్షణ అధికారులు ఏటీసీ 4.0 పేరు పెట్టారు. శిక్షణ పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉద్యోగాలు.. సొంతంగా ఉపాధి అవకాశాలు లభించేలా ఏటీసీల్లో సిలబస్ రూపొందించారు.

**ఒక్కటైనా ప్రారంభించేందుకు...** జూన్ 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్లేపల్లిలోని ఐటీఐలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆరునెలల్లో పూర్తి చేయాలంటూ అధికారులను ఆదేశించారు. తొలుత 25 ఏటీసీల నిర్మాణం పూర్తిచేసేందుకు టీజీఐఐసీ కార్యాచరణ రూపొందించింది. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నవంబరు 20 నాటికి 90శాతం నిర్మాణాలే పూర్తయ్యాయి. డిసెంబరు 7 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదవుతున్న సందర్భంగా మల్లేపల్లిలో నిర్మాణమవుతున్న ఒక్క ఏటీసీ కేంద్రానైన్నా పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు శరవేగంగా పనులు చేస్తున్నారు.

**వర్చువల్ రియాల్టీ ప్రయోగశాలలుంటాయి**

–ఎస్.వి.కె.నగేష్, రాష్ట్ర ఉపాధి శిక్షణ సహాయ సంచాలకులు

రాష్ట్రంలో 65 ఐటీఐలలో వర్చువల్ రియాల్టీ ప్రయోగశాలలు అందుబాటులోకి తెస్తున్నాం. ఇందుకోసం టాటా టెక్నాలజీస్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రోబోటిక్స్, కృత్రిమ మేధ, వర్చువల్ రియాల్టీ వంటి సాంకేతికతను విద్యార్థులకు నేర్పించనున్నాం.

# చలికి తాళలేక.. గమ్యం చేరలేక

హైదరాబాద్: చలి తీవ్రత ఆర్టీసీ ప్రయాణికులను వణికిస్తోంది. వేళకు రాని బస్సులు, రద్దీ పెరిగితే ఫుట్‌బోర్డ్ ప్రయాణాలతో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో మార్పు లేదు. నగరం నుంచి సుదూర ప్రయాణాలు చేసే వారికి ఇవే తిప్పలు. ఇతర జిల్లాలకు వెళ్లేవారు ముందస్తు బుకింగ్‌లు చేసుకున్నా రాత్రి సమయానికి పికప్ పాయింట్‌కు బస్సులు రావడం లేదు. గంటల తరబడి చలిలో పడిగాపులు పడుతున్నారు. బస్సు సమాచారం అందించే 'గమ్యం' యాప్ నిర్వహణపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **సాయంత్రం నుంచి పెరుగుతున్న చలి:** పది రోజులుగా నగరంలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం ఆరు దాటితే చలి తీవ్రత పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో వేళకు రాని బస్సులు ప్రయాణికులను మరింత ఇబ్బందిపెడుతున్నాయి. డొక్కు బస్సులో ప్రయాణాలు భారంగా మారాయి. చాలా



బస్సుల్లో విరిగిన, బిగుసుకుపోయిన కిటికీలు ఉన్నాయి. దీంతో చలిగాలితో ప్రయాణికులు వణికిపోతున్నారు. శివారు ప్రాంతాల్లో నడిపే బస్సులను బ్రేక్‌డౌన్ సమస్యలు వేధిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సు రాగన్నగూడ వద్ద బ్రేక్‌డౌన్ అయ్యింది. మరో బస్సు వచ్చే వరకు ప్రయాణికులు నిరీక్షించారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రాత్రి బస్సులు ఆగిపోతే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. విజయవాడ వెళ్లేందుకు ఇ–గరుడ బస్ కోసం రెండు గంటలు చలిలో వేచి ఉండాల్సి వచ్చిందని ప్రయాణికుడు కార్తీక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు పికప్ సమయం ఉండగా.. అరగంట ముందే దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌కు చేరుకున్నానని.. 1.15 గంటలకు బస్సు వచ్చిందంటూ వాపోయాడు. ఇబ్రహీంపట్నం, గండిమైసమ్మ, ఆమనగల్లు, హయత్‌నగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం వేళ బస్సులు లేక చలిలోనే వేచి ఉండాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతిపాదనల్లోనే విస్తరణ దశ..!



హైదరాబాద్ : మెట్రో రైలు మొదటి దశలోని మార్గాలనే మరింత దూరంగా విస్తరిస్తూ రెండో దశను ప్రతిపాదించారు. మూడు కారిడార్లలో ఆరు వైపులా ఉండగా.. ఐదు వైపులా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించి డీపీఆర్‌ను కేంద్రానికి పంపింది. కానీ మేడ్చల్ వైపు విస్మరించింది. ఇప్పుడు ఆ ప్రాంతం నుంచి మెట్రో కావాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. ఇటు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటం..రోడ్డు విస్తరణ జాప్యం కావడంతో మెట్రో సాధన సమితి పేరుతో ఆ ప్రాంతీయులు పోరాటం చేస్తున్నారు.

ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు ప్రస్తుతం మెట్రో ఉంది. దీన్ని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు రెండో దశలో ప్రతిపాదించారు. మరోవైపు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు విస్తరించాలని నిర్ణయించారు. అత్యంత రద్దీ మార్గం కావడంతో మెట్రో విస్తరణ పూర్తయితే నగరంలో ఉత్తరం వైపు నుంచి తూర్పు వరకు ప్రయాణం మరింత సౌకర్యంగా మారుతుంది.

ఎంజీబీఎస్ నుంచి చంద్రయాణగుట్ట వరకు విస్తరించి ఇక్కడ విమానాశ్రయ మెట్రోకు అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు.

కారిడార్–3లో నాగోల్ నుంచి రాయదుర్గం వరకు మెట్రోరైళ్లు నడుస్తున్నాయి. నాగోల్ నుంచి ఆరాంఘర్, శంషాబాద్ విమానాశ్రయం వరకు రెండో దశలో విస్తరించబోతున్నారు.

తూర్పు నుంచి దక్షిణం వైపు అనుసంధానం పెరగనుంది.

రాయదుర్గం నుంచి కోకాపేట వరకు ఐటీ కారిడార్‌లోనే మరింతగా విస్తరించబోతున్నారు. **ఇటు జాప్యమెందుకు..?** : జేబీఎస్ నుంచి ఉత్తరం వైపు మెట్రో పొడిగించాల్సి ఉండగా ఇదొక్కటి మాత్రం ప్రభుత్వం పట్టించుకోలేదు. జేబీఎస్ నుంచి అల్వాల్ మీదుగా శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి కొంపల్లి మీదుగా మేడ్చల్ వైపు మెట్రో వేయాలని డిమాండ్ చేస్తున్నారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు డబల్ డెక్ ఫ్లైఓవర్ చేపట్టి అందులో మెట్రో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు

**మెట్రో వేయాలంటే..** : మెట్రో వేయాలంటే రద్దీ సమయాల్లో గంటకు 10 వేల మంది రాకపోకలు ఉండాలని మెట్రో అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ అధ్యయనాలు ఉంటేనే కేంద్రం అనుమతిస్తుందని చెబుతున్నారు. వీటితో పాటు ఉత్తరంలో ఎన్‌హెచ్ ఫ్లైఓవర్లు నిర్మిస్తుండడంతో ఈ మార్గాన్ని రెండోదశలో చేర్చలేదు. భూసేకరణ పరంగా రక్షణ భూముల సేకరణ వంటి సమస్యలు ఈ మార్గంలో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# టీడీఆర్‌పై భూ యజమానుల వెనకడుగు





హైదరాబాద్: అభివృద్ధి బదలాయింపు హక్కుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది క్రితం వరకు సాఫీగా సాగిన టీడీఆర్ సర్టిఫికెట్ల జారీ.. ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయింది. ఏడాదిలో వంద మంది కూడా టీడీఆర్‌ను తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగదుతో పోలిస్తే నాలుగు రెట్ల విలువైన టీడీఆర్‌ను ఇస్తామంటున్నా యజమానులు వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిణామాలతో జీహెచ్‌ఎంసీ కంగుతింటోంది. నగదు చెల్లించి భూసేకరణ చేపట్టడం కష్టమంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. అభివృద్ధిపై ప్రభావం.. జీహెచ్‌ఎంసీ కొన్నేళ్లుగా అభివృద్ధి పనుల కోసం చేపట్టే భూసేకరణలో నగదు పరిహారానికి బదులు టీడీఆర్ సర్టిఫికెట్లను జారీ చేస్తోంది. ఆ సర్టిఫికెట్లతో అదనపు అంతస్తులను నిర్మించుకోవచ్చు. అలాంటి అవసరం ఉన్న వ్యక్తులు టీడీఆర్ యజమానులను సంప్రదించి అవసరమైన మేర కొనుగోలు చేస్తుంటారు. యజమానులూ వాటిని స్వీకరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో రూ.10వేల కోట్ల మేర బల్దియాపై ఆర్థిక భారం తగ్గింది. అభివృద్ధి పనులు కూడా వేగంగా సాగాయి. ఇప్పుడు టీడీఆర్‌కు మార్కెట్లో డిమాండ్ తగ్గిపోయింది. యజమానులు కోల్పోయిన భూమి విలువతో పోలిస్తే.. టీడీఆర్‌ను అమ్మడం ద్వారా వచ్చే ఆదాయం తక్కువ ఉంటుందనే అభిప్రాయం జనాల్లో వ్యాపించింది. దాంతో.. నగదు రూపంలో నష్టపరిహారం అందజేస్తేనే భూసేకరణకు అంగీకరిస్తామని యజమానులు తెగేసి చెబుతున్నారు. అలా చేస్తే.. పురోగతిలో ఉన్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. మినహాయింపులిస్తేనే: టీడీఆర్‌కు డిమాండ్ పెరగాలంటే ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులు కొంత శాతం టీడీఆర్‌ను కొనుగోలు చేసేలా నిబంధన పెట్టాలని, అనుమతుల రుసుం, ఇతరత్రా మినహాయింపులు ఇవ్వాలని అధికారులు సర్కారును కోరుతున్నారు. గతేడాది చివరి వరకు జారీ అయిన టీడీఆర్ ఇలా..జారీ అయిన టీడీఆర్‌లు.. : 1976ఆయా సర్టిఫికెట్లలోని భూ విస్తీర్ణం.. : 851ఎకరాలు ప్రభుత్వ ధర ప్రకారం వాటి విలువ.. : రూ.10,028.81కోట్లు

# నీటి కష్టాలు లేకుండా.. వేసవి గడిచేలా

హైదరాబాద్ : మహానగరంలో వేసవి నీటి కష్టాలకు ముందస్తు ప్రణాళికతో చెక్ పెట్టేలా జలమండలి కార్యాచరణ సిద్ధం చేస్తోంది. వేసవిలో భూగర్భజలాలు పడిపోవడంతో జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లపై ప్రభావం పడింది. ప్రధానంగా 6,9,15,18 జలమండలి డివిజన్లలోని పలు ప్రాంతాలతో పాటు కుత్బుల్లాపూర్ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడింది. జలమండలి నీటి ట్యాంకర్లకు భారీగా డిమాండ్ వచ్చిన ప్రాంతాలను పూర్తిగా మ్యాపింగ్ చేశారు. అక్కడ ట్యాంకర్లకు డిమాండ్ ఎందుకు ఏర్పడింది? సరఫరాలో ఉన్న సమస్యలు సహా పలు అంశాల ఆధారంగా ప్రత్యేకంగా ముందుస్తు ప్రణాళిక సిద్ధమవుతోంది. ప్రస్తుతం జలమండలి రోజుకు సగటున 570 ఎంజీడీల నీటిని నిత్యం సరఫరా చేస్తోంది. వేసవిలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో 10 ఎంజీడీలు సరఫరా చేసేందుకు



ప్రాథమికంగా గుర్తించారు.

**పెరిగిన వర్షపాతంతో ఊరట..**నగర పరిధిలో నైరుతిలో సాధారణ వర్షపాతం 615 మిల్లీమీటర్లు కాగా ఈ సారి 825 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుమలగిరి ప్రాంతంలో మాత్రం సాధారణ వర్షపాతం కంటే 20శాతం తక్కువ నమోదైంది. ఆ ప్రాంతంలో ట్యాంకర్లకు వేసవిలో డిమాండ్ ఎక్కువుండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రత్యేక దృష్టి సారించాలని భావిస్తున్నారు.

**గతేడాది భారీగా పెరిగిన ట్యాంకర్ల వినియోగం..**

మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై నెలల్లో గతంలో ఎన్నడూ లేనంతగా జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడింది. సగటున ప్రతి నెలా లక్షకుపైగా ట్యాంకర్లకు డిమాండ్ వచ్చింది. ఏప్రిల్‌లో గత ఆరేళ్లలో లేనివిధంగా రికార్డు స్థాయిలో 1.74 లక్షల ట్యాంకర్లు బుక్ చేశారు. ఇది అంతకుముందు ఏడాది ఏప్రిల్ నెల ట్యాంకర్ల డిమాండ్‌కు రెట్టింపు ఉండటం గమనార్హం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాల వారీ ట్యాంకర్ల డిమాండ్‌ను విశ్లేషించి తదనుగుణంగా రానున్న వేసవిలో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జలమండలి ఉన్నతాధికారులు వివరించారు.

# మహిళా సంఘాలు.. ఆర్థికాభ్యున్నతికి అడుగులు

కరీంనగర్ : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులేస్తోంది. ఆ దిశగా స్వశక్తి సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణాలపై లక్ష్యాన్ని సాధించేలా నగర, పురపాలికల్లో అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో కరీంనగర్ నగరపాలికతోపాటు నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింకేజీ వంద శాతం లక్ష్యం సాధించేలా చర్యలు చేపట్టారు. గతేడాది 170 శాతానికి పైగా రుణాలు అందించి ఎక్కువ మంది లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకున్నారు. ప్రభుత్వం కూడా మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించడంతో ఎక్కువ మందికి లబ్ధి జరిగేలా యూనిట్లు స్థాపించడం, రుణాలు అందేలా చూడాలని భావిస్తున్నారు.

**వ్యక్తిగత, గ్రూపులకు ప్రాధాన్యం**

బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకోవాలంటే ముందుగా స్వశక్తి సంఘాలు ఆరు నెలల వరకు క్రమం తప్పకుండా పొదుపు చేయాలి. మొదటి సంవత్సరం రూ.75 వేలు రుణం అందిస్తుండగా ఆ తర్వాత రూ.లక్ష నుంచి మొదలుకొని రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడానికి అవకాశముంటుంది. మహిళా సంఘాల్లో వ్యక్తిగత వ్యాపారాలు చేసుకోవడానికి, సమష్టిగా పెద్ద సంస్థలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి ఈ బ్యాంకు లింకేజీ వీలుంటుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించుకోవడానికి, పాత వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కూడా అందిస్తున్నారు.

**ప్రజాపాలన సంబరాల్లో భాగస్వామ్యం**

ప్రభుత్వ ప్రజాపాలన సంబరాల్లో మహిళలను భాగస్వాములు చేసేలా కార్యాచరణ తీసుకుంటున్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు, రుణాలను వివరించనున్నారు. రుణాలు సైతం అందించనున్నారు. కరీంనగర్ నగర పరిధిలో 65 గ్రూపులకు రూ.12 కోట్ల రుణాన్ని పంపిణీ చేయనున్నారు. వీధి వ్యాపారులకు ఇప్పటి వరకు రూ.10 వేలు, రూ.20 వేలు ఇచ్చారు. దీనిని రూ.50 వేలకు పెంచి రుణాలు మంజూరు చేస్తున్నారు. మొత్తం 38 మందికి రూ.19 లక్షలు అందించనున్నారు. ఇందిరా మహిళా శక్తి కింద 14 గ్రూపులకు రూ.1.95 కోట్లు అందించనున్నారు.

# అయిదు ఇసుక రీచ్‌ల గుర్తింపు

మెట్‌పల్లి : జిల్లాలో ఇసుక అవసరాల కోసం అధికారులు అయిదు రీచ్‌లను గుర్తించారు. ఇసుక అవసరమైన వారికి 'మన ఇసుక వాహనం' పోర్టల్ ద్వారా గుర్తించిన రీచ్‌ల నుంచి సరఫరా జరిగేలా నిర్ణయించారు. మెట్‌పల్లి, మల్లాపూర్, రాయికల్, కథలాపూర్, కోరుట్ల మండలాల్లోని పెద్దవాగుపై ఇసుక రీచ్‌లను గుర్తించి ఇక్కడి నుంచి జిల్లా పరిధిలో ఇసుక సరఫరా జరిగేలా చూడనున్నారు. భూగర్భ జలశాఖ, రెవెన్యూ, నీటిపారుదల, మైనింగ్ శాఖలు జిల్లాలో పది చోట్ల ఇసుక రీచ్‌ల ఏర్పాటు కోసం పరిశీలించారు. అయిదు చోట్ల ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనువుగా ఉందని గుర్తించారు. కోరుట్ల మండలం పైడిమడుగు, కథలాపూర్ మండలం సిరికొండ, రాయికల్ మండలం ఇటిక్యాల, మల్లాపూర్ మండలం సాతారం, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దవాగుల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి 33,907.26 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని గుర్తించారు. 'మన ఇసుక వాహనం' కింద నమోదు చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా చేసేందుకు నిర్ణయించారు. ఇసుక చేర్చే దూరాన్ని బట్టి కిలోమీటర్ల వారీగా రుసుము నిర్ణయించారు.



# పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు: హరీశ్‌రావు

హైదరాబాద్: పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "మూసీ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోంది. కేంద్రం, పార్లమెంటుకు ఒకటి చెప్పి మరొకటి అమలు చేస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు పార్లమెంటుకు చెప్పారు. దేశంలో ఏ ప్రాజెక్టులోనైనా నిర్వాసితులను ఆదుకోవాలని 2013లో చట్టం తీసుకొచ్చారు.

దానికంటే మెరుగైన చట్టం అమలు చేస్తే ఆయా రాష్ట్రాలు సొంతంగా కొత్త చట్టాలు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో భారాస హయాంలో మరింత మెరుగ్గా 2014లో భూసేకరణ చట్టం తీసుకువచ్చాం. నేడు అదే రాష్ట్రంలో అమలులో ఉంది. ఎన్యుమరేషన్ తర్వాత 60 రోజుల గడువు ఇచ్చి పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలి. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకొని మరో 30 రోజుల గడువు ఇస్తూ పీడీ నోటిఫికేషన్ ఇవ్వాలి. అభ్యంతరాలు నివృత్తి చేసిన తర్వాత ప్రక్రియ మొదలుపెట్టాలి. ప్రస్తుతం ఎన్యుమరేషన్ జరగలేదు.. పీడీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. డీపీఆర్ లేదు.. లబ్ధిదారులను గుర్తించలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై స్పందించరా?: భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు



హైదరాబాద్: సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ హస్టళ్లుగా మారాయని భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ హాస్టళ్ల దుస్థితి ఇలాగే ఉందన్నారు. అవినీతి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వత్తాసు పలుకుతుందో అర్థం కావడం లేదన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట జిల్లా డీఈవో బదిలీ వెనుక మర్మం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో కోదండరాం, ఆకునూరు మరళి ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. హాస్టళ్లలో పరిస్థితి దారుణంగా ఉందని గతంలో మాజీ మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వరుస ఘటనలు జరిగితే సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికీ స్పందంచలేదని ఆక్షేపించారు. ఏ పార్టీ ఎవరితో కలిసి పనిచేస్తుందో ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్, భారాస నేతలు బయట విమర్శలు చేసుకుంటున్నారు.. లోపాయికారిగా కలిసి వ్యాపారాలు చేస్తున్నారు.

# గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కారణాలు తేల్చేందుకు టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్: ఇటీవల గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులకు సంబంధించి కారణాలు తేల్చేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలు, హాస్టళ్లు, అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది. పాఠశాల ఫుడ్ సేఫ్టీ కమిటీలో హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బంది ఉంటారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వంట చేసే ముందు కిచెన్ పరిశీలించి పరిశుభ్రత నిర్ధారించాలి, ఫుడ్ సేఫ్టీ కమిటీ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు ఆహారం వడ్డించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

# సమస్యలపై అధ్యయనం.. తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రవ్యాప్త పర్యటన



హైదరాబాద్: తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్నలు పర్యటన చేపట్టారు. గురువారం నుంచి డిసెంబరు 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో పర్యటించి.. అక్కడి పరిస్థితులను కమిషన్ సభ్యులు పరిశీలించనున్నారు. ఇవాళ సంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్‌లలో కమిషన్ పర్యటించనుంది. ఈ నేపథ్యంలో కమిషన్ పర్యటనకు సహకరించడంతోపాటు.. అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





## ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోవడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "విద్యార్థులకు పరిశుభ్ర వాతావారణంలో పౌష్టికాహారం అందజేయాలి. మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచాం.

ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. బాధ్యులైన వారిపై జిల్లా కలెక్టర్లు వేటు వేయాలి. వదంతులతో భయాందోళనలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల్లోంచి తొలగించేందుకూ వెనుకాడబోం" అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.




## మహారాష్ట్ర క్యాబినెట్.. సగం బెర్త్‌లు భాజపాకేనా? మరి శిందే వర్గానికి ఎన్ని?

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలో ప్రభుత్వం ఏర్పాటుపై నెలకొన్న ప్రతిష్టంభన ఓ కొలిక్కి వచ్చినట్లే కన్పిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి పదవి భాజపాకే దక్కనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా క్యాబినెట్ కూర్పుపైనా కూటమిలో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. మంత్రిమండలిలో సగం బెర్త్‌లు భాజపా వద్దే ఉంచుకోనున్నట్లు సమాచారం. ఇక ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనకు మూడు కీలక శాఖలతో పాటు 12 పదవులు దక్కనున్నాయట..! మహారాష్ట్ర మంత్రి మండలిలో గరిష్ఠంగా 43 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఇందులో 20కి పైగా పదవులను భాజపా తీసుకునేందుకు కూటమి నేతల మధ్య అంగీకారం కుదిరినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. శివసేనకు 13, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీకి 9 క్యాబినెట్ సీట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. శిందే వర్గానికి పట్టణాభివృద్ధి, ప్రజా పనుల అభివృద్ధి, జల వనరుల శాఖలను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు మహాయుతి నేతలు శిందే, ఫడణవీస్, అజిత్ పవార్ గురువారం దిల్లీలో భాజపా అధిష్ఠానంతో చర్చించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశం అనంతరం తదుపరి సీఎంపై ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది. కొత్త ముఖ్యమంత్రిగా భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ వైపే మొగ్గే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈనెల 30న గానీ, వచ్చే నెల 1న గానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరే అవకాశముంది. ఈసారి కూడా ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను నియమించనున్నట్లు తెలుస్తోంది.


**మేం అలా ప్రాధేయపడలేదు : సంజయ్‌రౌత్...** మరోవైపు, మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమవుతుండటంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శలు గుప్పించారు. "వారికి పూర్తి మెజార్టీ వచ్చినా ఇంకా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేకపోతున్నారు. ఫలితాలు వచ్చి 7 రోజులైనా సీఎం ఎవరనేది చెప్పట్లేదు. తమ ముఖ్యమంత్రి ఎవరనేది ప్రధాని, అమిత్ షా, వారి నేతలు ఎందుకు నిర్ణయించుకోలేకపోతున్నారు. శివసేన పేరు పెట్టుకొని ఏక్‌నాథ్ శిందే రాజకీయాలు చేశారు. కానీ, ఇప్పుడు సొంత నిర్ణయాలు తీసుకోలేక దిల్లీ వెళ్లారు. మా హయాంలో బాలాసాహెబ్ ఠాక్రే భవిష్యత్తును ఎన్నడూ దిల్లీలో నిర్ణయించలేదు. ముంబయిలోనే ఉన్నాం. కానీ, ఇప్పుడు వారు దిల్లీ వెళ్లి పదవుల కోసం ప్రాధేయపడుతున్నారు" అని రౌత్ ఎద్దేవా చేశారు.

# కేటీఆర్.. దిలావర్‌పూర్ రండి.. అక్కడే తేలుద్దాం: మంత్రి సీతక్క సవాల్



హైదరాబాద్: భారాస హయాంలోనే నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు ఇచ్చారని మంత్రి సీతక్క అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే పరిశ్రమకు అనుమతులు ఎవరు ఇచ్చారో మాట్లాడదామని.. దిలావర్‌పూర్ రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో గాంధీభవన్ వద్ద సీతక్క మీడియాతో మాట్లాడారు. "భారాస హయాంలో ఎన్నో పరిశ్రమలకు కనీసం గ్రామసభలు కూడా నిర్వహించకుండా అనుమతులు ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన లక్షల ఎకరాల అసైన్డ్ భూములను రియల్ ఎస్టేట్ కోసం తీసుకున్నారు. ఇప్పుడు మాత్రం గ్రామసభల్లో ఒకరిద్దరిని రెచ్చగొట్టి అధికారులపైకి ఉసిగొల్పుతున్నారు. ఇథనాల్ పరిశ్రమలో డైరెక్టర్‌గా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు ఏపీకి చెందిన పుట్టాసుధాకర్ యాదవ్ కుమారుడు ఉన్నారు. ఆ పరిశ్రమకు అనుమతులు ఇచ్చే సమయానికి మరో డెరెక్టర్‌గా తలసాని కుమారుడు సాయి ఉన్నారు. కేటీఆర్.. ఎక్కడెక్కడో తిరగడం ఎందుకు?ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్దాం. ఎవరు అనుమతులు ఇచ్చారో అక్కడే తేలుద్దాం. మీ హయాంలోనే పరిశ్రమకు అనుమతులు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఒప్పుకోండి. ఈ అంశంపై ఆధారాలతో సహా త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తాం. అసెంబ్లీలో దీనిపై చర్చ పెడతాం. తప్పుడు ప్రచారాలతో ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరు" అని సీతక్క మండిపడ్డారు.

# పార్టీ ఫిరాయింపులపై కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



హైదరాబాద్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు ( కొట్టేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించాలని కేఏ పాల్ పిటిషన్ పిటిషన్‌లో కోరారు. వారు అసెంబ్లీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోకుండా, తీర్మానాల్లో ఓటు వేయకుండా ఆదేశించాలన్నారు. దానం నాగేందర్ గత పదేళ్లలో కాంగ్రెస్, భారాస పార్టీలు మారుతూ వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఇలా పార్టీలు మారితే ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతుందని చె ప్పారు. వాళ్లపై చర్యలు తీసుకోపోతే ఎమ్మెల్యేలు పార్టీ మారడం సహజమైపో తుందని కేఏ పాల్ వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం స్పీకర్ పరిధిలో ఉందని హైకోర్టు చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని ఇటీవల తీర్పులో వెలువరించామని పేర్కొంది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే ఆ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించలేమని స్పష్టం చేసింది.

# ఇథనాల్ కంపెనీలో మాకు వాటాలు లేవు.. నిరూపిస్తే వాళ్లకే రాసిస్తా: మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ప్రతిపాదించిన ఇథనాల్ కంపెనీకి, తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తమకు వాటాలున్నాయని మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షుడు అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు వాటాలున్నాయని నిరూపిస్తే వాళ్లకే రాసిస్తానని చెప్పారు. ఇథనాల్ కంపెనీ వద్దని అక్కడి గ్రామస్తులు ధర్నాలు చేస్తున్నారని, దానిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజమండ్రి దగ్గర ఒక డిస్టిలరీస్ కంపెనీలో 8 మంది డైరెక్టర్లలో ఒకరిగా నా కుమారుడు ఉన్నారని, 2016లోనే దానికి రాజీనామా చేశాడన్నారు. అదే ఏడాది ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఏపీలో ఒప్పందం కుదిరిందని, ఆ తర్వాత దానిని రద్దు చేసుకున్నారని తెలిపారు. పాత పేపర్ పట్టుకుని తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. దానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజమన్నారు. లగచర్లలో కేటీఆర్ కుట్ర చేశారని ప్రభుత్వం ఆరోపణలు చేసిందన్నారు. రాష్ట్రంలో అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని, రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో వున్నారని చెప్పారు. శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్ నిర్వహిస్తామని తలసాని చెప్పారు. రేపు ఉదయం నిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు బసవతారకం కేన్సర్ హాస్పిటల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ దీక్షా దివస్ నిర్వహిస్తామని వెల్లడించారు. వేల మంది గులాబీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660